విత్తు నుంచి విక్రయం వరకూ భరోసా

- మంత్రి చెల్లుబోయిన వేణు
- పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు


దుళ్లలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు


దుళ్లలో మగ్గం నేస్తున్న మంత్రి వేణు

కడియం: విత్తనం నుంచి విక్రయం వరకూ రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భరోసా కల్పించిందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, పౌర సంబంధాలశాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కడియం మండలం దుళ్లలో రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసాకేంద్రం, రూ. 25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాలను, ఎస్సీ ఏరియాలో రూ.16 లక్షలతో నిర్మించిన డ్రైనేజీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాట మేరకు నాలుగు సంవత్సరాల ఎనిమిది నెలల కాలంలో రైతు భరోసా కేంద్రాలు నిర్మించడమే కాకుండా, పంటలు వేసే సమయంలో రైతులు అప్పుల పాలు కాకుండా ఆర్థిక సాయం కూడా ఇస్తున్నారన్నారు. ఇప్పటి వరకు రూ.35 వేల కోట్ల రూపాయల సాయాన్ని రైతులకు అందించడం జరిగిందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైగా ఉందని మంత్రి వేణు అన్నారు. అందులో భాగంగానే తానే స్వయంగా ప్రతి గ్రామంలోనూ పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నానన్నారు. స్వచ్ఛ మనందరి బాధ్యత కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడడంతో పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని మంత్రి వేణు అన్నారు.

కాలినడకన పర్యటన

దుళ్లలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి వేణు కాలినడకనే పర్యటించారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు ప్రారంభించి, మొక్కను నాటారు. అనంతరం అక్కడి ఎస్సీపేట వరకు కాలినడకన వెళ్లారు. మార్గం మధ్యలో స్వాతంత్ర్య సమరయోధులు బులుసు సాంబమూర్తి విగ్రహాన్ని శుభ్రం చేయించి పుష్పాంజలి ఘటించారు. గ్రామంలోని పలు వీధులను స్వయంగా పరిశీలించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మగ్గాలను పరిశీలించారు. చేనేత కార్మికులతో మాట్లాడారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎస్సీ పేటలోని డ్రైనేజీని ప్రారంభించి, శిలాఫలకం ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మండల పార్టీ అధ్యక్షులు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, సహకార సొసైటీ చైర్మన్లు వెలుగుబంటి అచ్యుతరామ్, తిరుమలశెట్టి శ్రీను, వట్టి సూరిబాబు, సాకా కిరణ్‌కుమార్, జిల్లా బీసీవిభాగం కార్యదర్శులు టేకి శ్రీనివాసరావు, కట్టా జమీందారు, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ, తాతపూడి బాబీ, సన్నపు బ్రహ్మానందం, నామాల బాలసరోజిని, సీహెచ్ ఆనంద్, ఇందుపురాల శ్రీను కంటిపూడి సాయి, ఉరదాల శ్రీరాములు, పందిరి సుబ్రహ్మణ్యం, జిలగం గంగాధరం, వారణాశి గుప్త, కొత్తపల్లి వేంకటేశ్వరరావు, అయినవిల్లి వేంకటేశ్వరరావు, రేమళ్ల ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల అభివృద్ధికి కృషి

చేనేత కార్మికుల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి చెల్లుబోయిన వేణు అన్నారు. మండలంలోని దుళ్లలో శుక్రవారం ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. చేనేత కార్మికుడు కాలెపు దుర్గాప్రసాద్ ఇంటిని సందర్శించారు. అక్కడ మగ్గం నేసి, రాట్నం వడికారు. పథకాల అమలు తీరుపై ఆరాతీశారు. అమ్మ ఒడి, రుణ మాఫీ, చేయూత, పెన్షన్ తదితర పథకాల ద్వారా ఇప్పటి వరకు తన కుటుంబానికి రూ. 3.60 లక్షల ఆర్థిక ప్రయోజనం పొందామని దుర్గాప్రసాద్ మంత్రికి వివరించారు. మడికి నుంచి దుళ్ల మీదుగా ఏడిద వరకు ఉన్న సాగునీటి కాలువ ఆక్రమణలకు గురైందని, దీని వల్ల 1500 ఎకరాలకు సాగునీరు అందడం లేదని స్థానిక రైతు చామకూరి వీరపక్షియ్య మంత్రి దృష్టికి తెచ్చారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడిన మంత్రి పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. పాముకాటుకు గురైన జి.గోవిందం కుటుంబానికి ఉద్యోగం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆచంట శ్రీనుకు పూర్తిస్థాయి పెన్షన్ ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో కలిసి మురుగు కాలువల్లో పూడికతీత పనుల్లో మంత్రి వేణు పాల్గొన్నారు.

విద్యకు అత్యంత ప్రాధాన్యం

సీటీఆర్ఐ: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని మంత్రి వేణు అన్నారు. స్థానిక గణేష్ చౌక్ సమీపంలోని బీసీ సంక్షేమ వసతి గృహాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి చేయడంతో పాటు నాణ్యమైన విద్యను సీఎం జగన్ అందిస్తున్నారన్నారు.

క్లుప్తంగా

పశుసంవర్ధకశాఖ జేడీకి రాష్ట్రస్థాయి అవార్డు


మంత్రి అప్పలరాజు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సత్య గోవింద్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పశుసంవర్ధకశాఖ అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు అమలులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి ఎస్‌టీజీ సత్య గోవింద్ రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. రిపబ్లిక్‌డే సందర్భంగా గుంటూరులోని రాష్ట్ర పశుసంవర్థకశాఖ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర కుమార్ చేతుల మీదుగా ఆయన సన్మానం అందుకుని ప్రశంసా పత్రం, మెమెంటో స్వీకరించారు.

సిలిండర్ల పట్టివేత

కంబాలచెరువు: గృహావసరాల సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఇన్‌చార్జి రీజినల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సురేష్‌బాబు హెచ్చరించారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ఆంధ్రా మిలటరీ హోటల్‌లో డొమెస్టిక్ (గృహ) సిలిండర్లను ఉపయోగిస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం ఆ ప్రాంతంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో హోటల్లో ఐదు గృహావసరాల సిలిండర్లను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని, హోటల్ యజమాని బి.హేమంత్ కుమార్‌పై కేసు నమోదు చేశారు.

భవిత కేంద్రం సేవలు భేష్

ధవళేశ్వరం: ధవళేశ్వరంలోని భవిత కేంద్రం సేవలు బాగున్నాయని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సుభాషిణి అన్నారు. శుక్రవారం ధవళేశ్వరంలోని భవిత కేంద్రాన్ని సుభాషిణి, సహిత విద్య కో ఆర్డినేటర్ కనకబాబు పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు మానసికోల్లాసం కోసం స్పోర్ట్స్ కిట్లు ఇవ్వాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

రేషన్ కిట్ల వితరణ

సీటీఆర్ఐ: స్థానిక శ్రీరామకృష్ణ మఠంలో స్వామి వివేకానంద 162వ జన్మతిథి వేడుకలలో భాగంగా శుక్రవారం ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం నారాయణసేవ పేరుతో 170 మంది పారిశుధ్య కార్మికులకు రేషన్ కిట్లు పంపిణీ చేశారు. ఒక్కొక్క రేషన్ కిట్‌లో 9 రకాల వంట సరకులు అందించారు. కార్యక్రమంలో స్వామి శశికాంతానందజీ, స్వామి వేదవిద్యానందజీ, స్వామి పరిజ్ఞేయానందజీ పాల్గొన్నారు.

టూటౌన్ సీఐగా శ్రీనివాసరావు



కంబాలచెరువు: రాజమహేంద్రవరం రెండో పట్టణ సీఐగా వీరవల్లి శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సీఐడీ విభాగం నుంచి లా అండ్ ఆర్డర్‌కు బదిలీపై వచ్చారు.

కళాతపస్వి విశ్వనాథ్‌కు నివాళి


లఘుచిత్రాల దర్శకుడు కళ్యాణ్‌కు విశ్వనాథ్ పురస్కారం అందజేస్తున్న ప్రముఖులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ ప్రథమ వర్ధంతిని శుక్రవారం స్థానిక జిత్‌మోహన్‌మిత్ర కళావేదికపై నిర్వహించారు. నటగాయకుడు శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, అల్లు బాబి, గుమ్మడి సమర్పణరావు, దొండపాటి సత్యంబాబు, బి.సీతారామారావు, పీవీఎస్ కృష్ణారావు హాజరయ్యారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ కె.విశ్వనాథ్ సినిమాల చిత్రీకరణ రాజమహేంద్రవరం పరిసరాల్లోనే ఎక్కువగా జరిగేదన్నారు. శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర మాట్లాడుతూ కె.విశ్వనాథ్ చిత్రాల్లో నటించడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. లఘు చిత్రాల దర్శకుడు శ్రీకళ్యాణ్‌కు కె.విశ్వనాథ్ పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు.

పేకాట ఆడుతున్న ఏడుగురి అరెస్టు

కంబాలచెరువు: స్థానిక విద్యానగర్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురిని మూడో పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.9 వేలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

లలితానగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుబ్బారావు నగర్‌కు చెందిన గణేష్ లలితా నగర్‌లో మద్యం బాటిళ్లు అమ్ముతుండగా పట్టుకున్నారు. అతని నుంచి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన ఏపీ స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ పీవీపీ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ చిత్తడి నేలల పర్యావరణ ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ చిత్తడి నేలలను కాపాడుకునేందుకు అందరూ ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో బోటనీ, జువాలజీ, జియాలజీ విభాగాల అధిపతులు డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ ఎంఆర్ గౌతమ్, కె.దుర్గారావు పాల్గొన్నారు.

కడియం ఎంపీడీవోగా మనోజ్


ఎంపీడీవో మనోజ్‌ను అభినందిస్తున్న కార్యాలయ సిబ్బంది

కడియం: ఎంపీడీవోగా గంజి రాజ్ మనోజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన రత్నకుమారి కృష్ణాజిల్లాకు బదిలీపై వెళ్లారు. కాగా.. మనోజ్‌కు ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అలాగే పలు పంచాయతీల కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిశారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు


మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్

- చంద్రబాబు మాటలు నమ్మితే అనర్థమే
- ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి జగనన్న ఏదైనా మాటిస్తే, అందుకు కట్టుబడి ఉంటారనేది డ్వాక్రా మహిళల రుణమాఫీ, రైతు రుణమాఫీ చూస్తే ఎవరికైనా అర్థమవుతుందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని 21, 22, 23,6, 14, 15 డివిజన్లలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా 4వ విడత నిధులు విడుదల సందర్భంగా సంబరాలు నిర్వహించారు. మహిళలకు నమూనా చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి శరవేగంగా పరుగులు పెడుతోందన్నారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, రైతు రుణమాఫీ చేస్తానని నమ్మించి అధికారంలోకి వచ్చాక నిలువునా మోసం చేశారన్నారు. అలాగే బాబు వస్తే జాబు గ్యారంటీ అని చెప్పి నిరుద్యోగ యువతకు ఆశ చూపి నిలువునా ముంచేశారన్నారు. కనీసం నిరుద్యోగ భృతి కూడా ఇవ్వలేదన్నారు. మరోసారి ఓట్ల కోసం ప్రజలను వంచించేందుకు చంద్రబాబు ప్రజల వద్దకు వస్తున్నారని, ఆ జిమ్మిక్కులకు నమ్మి మోసపోతే నిజంగా రాష్ట్ర ప్రజలు పెద్ద స్కాంలో ఇరుకున్నట్లేనని అన్నారు. స్కాం బాబు మాయమాటలు ఎవరూ నమ్మవద్దన్నారు. దేశ వ్యాప్తంగా ధరలు పెరిగాయని, ధరల పెరుగుదలను నియంత్రించాల్సింది కేంద్ర ప్రభుత్వం అన్నారు. ఈ విషయాలను ప్రజలు గ్రహించాలని విజ్ఞప్తి చేశారు.

సమర్థంగా పథకాల అమలు

ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ జగనన్న సీఎం అయ్యాక ఎన్నో సంక్షేమ పథకాలు సమర్థంగా అమలు చేస్తున్నారని, టీడీపీ అధికారంలోకి వస్తే ఒక్క సంక్షేమ పథకం కూడా కొనసాగదన్నారు. రాష్ట్రంలో 80 లక్షల మంది డ్వాక్రా మహిళలకు రూ.25 వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. టీడీపీ నేతల అడ్డంకుల వల్లే ఇళ్ల పట్టాలను అనుకున్న సమయానికి ఇవ్వలేకపోయామని, సాధ్యమైనంత త్వరలో వాటిని అందజేస్తామన్నారు. టిడ్కో గృహ లబ్ధిదారులకు వచ్చే సోమవారం నుంచి పంపిణీ మొదలు పెట్టి, పది రోజుల్లో అందరికీ అందజేస్తామన్నారు. కార్యక్రమాలలో గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ స్టేట్ చైర్ పర్సన్ సంకిస భవానీ ప్రియ, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పోలు విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఏవీ రమణ, ఉమా మార్కండేయేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్ రామసాయిదీపు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

- ప్రతిపక్షాలు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా లాభం శూన్యం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


ప్రభుత్వాసుపత్రిలో బాధితురాలు ఆశను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజా

రాజమహేంద్రవరం సిటీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎవరు ఎన్ని పొత్తులతో వచ్చినా, అధికారంలోకి వచ్చేది మాత్రం వైఎస్సార్ సీపీయేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. తాడితోట సంహిత కన్వెన్షన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు అవలంబిస్తున్న తీరుపై విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ గడచిన 4 ఏళ్ల 8 నెలల్లో దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయలేని అనేక సంక్షేమ పథకాలను జగన్ అందించారన్నారు. సుమారు 2.5 లక్షల కోట్ల రూపాయలను కుల, మత, వర్గ రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న వారందరికీ పంపిణీ చేశారన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాలూ అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో సీఎం జగనన్న పనిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఒక పేదవారికి కూడా అంగుళం భూమి ఇవ్వలేదని, నేడు జగనన్న పాలనలో లక్షల లక్షల మందికి ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్ల నిర్మాణానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజానగరం నియోజకవర్గంలో సుమారు 20 వేల మందికి పైగా ఇళ్ల స్థలాలు కేటాయించమన్నారు. చంద్రబాబు నాయుడు రిటైర్మెంట్ తీసుకునే సమయం ఆసన్నమైందని, ఎన్నికల తర్వాత తెలుగుదేశం పార్టీ కార్యాలయాలు హెరిటేజ్ కార్యాలయాలుగా మారిపోతాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కామ్‌లో చంద్రబాబు నాయుడు కోట్లాది రూపాయలు దోచుకుంటే, ఆ పార్టీ నాయకులు జన్మభూమి కమిటీల పేరుతో పేదలను దోచుకున్నారన్నారు. రాజానగరంలో మరోసారి దాదాపు 50 వేల ఓట్ల మెజారిటీతో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

బాధిత మహిళకు పరామర్శ

కంబాలచెరువు: సీతానగరం మండలం చిన కొండేపూడి పరిధిలోని పెదకొండేపూడిలో భర్త చేతిలో శిరోముండనానికి గురైన షేక్ ఆశ అనే మహిళను ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. ఆమె వైద్య పరీక్షల కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హుటాహుటిన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని బాధిత మహిళను పరామర్శించి, జరిగిన సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నిందితుడిని పట్టుకుని చట్టపరంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించడం జరిగిందన్నారు. బాధిత మహిళకు ప్రభుత్వ పరంగా తోడుగా ఉంటామన్నారు.

రూ.10 లక్షల పోస్టల్ బీమా చెక్కు అందజేత

రాజమహేంద్రవరం సిటీ/ ప్రకాశం నగర్: మృతుల కుటుంబాలను తపాలా బీమా ఆదుకుంటుందని పోస్టల్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ అన్నారు. ఇండియా పోస్ట్ అనుబంధ సంస్థ ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ఆధ్వర్యంలో గ్రూప్ ఆక్సిడెంట్ గార్డ్ పాలసీ కింద ప్రమాద బీమా పరిహారం రూ.పది లక్షలను సదరు కుటుంబానికి అందజేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కోమల్ కుమార్ మాట్లాడుతూ వార్షిక ప్రీమియం రూ.399తో రూ.10 లక్షల ప్రమాద బీమా పరిహారం అందజేస్తున్నట్లు తెలిపారు. ఫ్లెక్స్ బ్యానర్స్ కార్మికుడు సోమాల వీరబాబు ప్రమాదవశాత్తూ మృతి చెందడంతో నామినీ అయిన అతడి భార్య ఆదిలక్ష్మికి టాటా ఏఐజీ వారు ప్రమాద బీమా పరిహారంగా రూ.పది లక్షల చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈస్ట్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ గంటి రామకృష్ణ, వెస్ట్ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజేశ్, ఇండియా పోస్ట్ చెల్లింపుల బ్యాంక్ మేనేజర్ రాజేంద్ర నాయుడు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజానగరం నియోజకవర్గ వ్యాప్తంగా 117 ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. రాజమహేంద్రవరం సంహిత కన్వెన్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే కొన్ని ఆలయాల నిర్మాణం పూర్తయిందని త్వరలోనే మిగతా ఆలయాల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. కోరుకొండ శ్రీలక్ష్మి నరసింహస్వామి రాజగోపురం నిర్మాణం, రంగనాథ స్వామి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన త్వరలోనే నిర్వహిస్తామన్నారు. కాటవరంలో శివాలయం నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

చారిత్రక, వారసత్వ సంపదను పరిరక్షించాలి


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరంలోని చారిత్రక, వారసత్వ సంపదను పరిరక్షించాలని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కర్రి రామారెడ్డి సూచించారు. స్థానిక ఆనం రోటరీ హాలులో రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు ప్రముఖులు, వక్తలు పాల్గొన్నారు. కొన్ని సూచనలను, డిమాండ్‌లను చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం పేరుతో ఉన్న చారిత్రక సుబ్రహ్మణ్య మైదానాన్ని సుందరీకరణ పేరుతో ఓపెన్ ఎయిర్ సినిమా ప్రాంతంగా మార్చడాన్ని తప్పుపట్టారు. చిత్రాంగి ప్యాలెస్ కింద ఉన్న సొరంగ మార్గం పెద్దాపురం పాండవుల మెట్ట వరకు ఉన్నట్లు అక్కడ చారిత్రక ఆనవాళ్లు చెబుతున్నాయని, వాటిని గుర్తించి చిత్రాంగి గెస్ట్ హౌస్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు. హేవ్‌లాక్ వంతెన, దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ, కందుకూరి వీరేశలింగం నడయాడిన పురం మందిరం, హితకారిణి సమాజంలోని పురాతన కట్టడాల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కృష్ణకుమార్, పంతం కొండలరావు, టీకే విశ్వేశ్వరరెడ్డి, జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్రైస్తవ ఆస్తుల పరిరక్షణకు సమష్టి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న నెల్సన్ బాబు

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరంలోని లూథరన్ క్రైస్తవ ఆస్తుల పరిరక్షణకు కలిసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని లూథరన్ క్రైస్తవ ఆస్తుల పరిరక్షణ జేఏసీ కన్వీనర్ జి.డేవిడ్ నెల్సన్ బాబు అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1852లో బాలికల విద్యకోసం స్థాపించిన షాడే బాలికల పాఠశాలను లూథరన్ సంఘం అధికారులు 2011లో అక్రమంగా 16,000 గజాల స్థలాన్ని లీజు కిచ్చారన్నారు. 2017లో దీని నిమిత్తం ప్రజల ఆందోళన చేశారన్నారు. ఈ ఆందోళన వల్ల 2017 సెప్టెంబర్ 20 తేదీన అక్రమ లీజును రద్దు చేశారన్నారు. అయితే ఇటీవల స్థానిక కిమ్స్ బొల్లినేని హాస్పిటల్‌కి చెందిన వ్యక్తులు కొందరు షాడే బాలికల స్కూల్ క్యాంపస్‌లో చొరబడి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ తగు చర్యలు తీసుకుని, అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరారు. సమావేశంలో మోర్తా శ్యామ్ సుందరం, ఆర్. ప్రసన్న కుమార్, ఎం.సుదర్శన రాజు, జె.సాల్మన్ రాజు పాల్గొన్నారు.

502 మందికి వైద్య సేవలు


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ నాగదేవి

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరు గ్రామ సచివాలయం -1 పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్యశిబిరంలో 502 మందికి వైద్యసేవలు అందించారు. ఇద్దరిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ శిబిరాన్ని ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్, సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. కాతేరు పీహెచ్‌సీ వైద్యురాలు ఈ.నాగేదేవి, గైనకాలజిస్ట్ సునీత, జనరల్ ఫిజీషియన్ వి.మహేష్, ఆప్తాల్మలజిస్ట్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన

- ఎంపీ భరత్‌రామ్
- వైఎస్సార్ సీపీలో 200 మంది చేరిక


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక 3వ డివిజన్ సుబ్బారావుపేటలో బెజవాడ నరసింహులు, బెజవాడ వెంకన్న, కొనపాకుల వెంకట రమణ, కొనపశకుల కృష్ణ, బెజవాడ కృష్ణ ఆధ్వర్యంలో సుమారు 200 మంది శుక్రవారం ఎంపీ భరత్‌రామ్, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎంపీ మాట్లాడుతూ జగనన్న పాలనకు ఆకర్షితులై అనేకమంది వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. డివిజన్ ఇన్‌చార్జి బల్లా సత్యవతి, మాజీ కార్పొరేటర్లు పాలిక శ్రీనివాస్, బొంతా శ్రీహరి, నాయకులు కేబుల్ శ్రీనివాస్, బల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

'సిద్ధం' సభకు తరలిరావాలి

రాజమహేంద్రవరం రూరల్: ఏలూరు జిల్లా దెందులూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం నిర్వహిస్తున్న 'సిద్ధం' సభకు రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నాయకులు కార్యకర్తలు తరలి రావాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ సమాచార పౌర సంబంధాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.